# గుర్తు చేసుకోవడమంటే ఆచరించడమే

జి. మోహన్*

**బా**లగోపాల్‌గారితో నా తొలి పరిచయం 1989 నల్గొండ జిల్లా పౌరహక్కుల సంఘం మొదటి సభల సందర్భంలో. ఇక్కడే స్వతంత్ర ఆలోచన, నిష్పాక్షికత కలిగిన ఆయన వ్యక్తిత్వం నాకు పరిచయమయ్యింది. హక్కుల కార్యకర్తగా నేను రూపు దిద్దుకోవడానికి తగిన స్ఫూర్తిని ఆయన నుంచి పొందడం మొదలయ్యింది.

నల్గొండ జిల్లాలో భిన్న రాజకీయ దృక్పథాలు కలిగిన రెండు విప్లవ గ్రూపుల వారు పౌరహక్కుల సంఘంలో ఉండేవారు. ఆ సభలో సంఘ బాధ్యతల నిర్వహణను సగం సగం పంచుకుందామని వాటాలు వేసుకుంటున్న సందర్భంలో బాలగోపాల్ అప్రజాస్వామికమైన ఈ పద్ధతిని ఖండించారు. పనిచేసే వ్యక్తులు సంఘ బాధ్యులుగా ఉండాలి కానీ వాటాలు వేసుకోవడమేమిటంటూ విమర్శించారు. అంతవరకూ నాకు బాలగోపాల్‌పై ఉన్న అభిప్రాయం తొలగిపోయి, ఆయనో స్వతంత్రమైన వ్యక్తని అర్థమైంది.

సంఘంలో ప్రజాస్వామిక విలువల ఆచరణకు ఆయన ఎంతగా ప్రాధాన్యం ఇస్తారో తెలియజెప్పే మరో సందర్భం - మానవ హక్కుల వేదిక మొదటి రాష్ట్ర మహాసభలు మిర్యాలగూడెంలో జరగడానికి ముందు రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. మహాసభల్లో కొత్త కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకుంటారు. పాత కార్యవర్గం కొత్త కార్యవర్గంలో ఎవర్ని తీసుకుంటే బాగుంటుందో ఒక ప్రతిపాదనను ఉంచుతుంది. దానిపై చర్చ జరుగుతోంది. ఒక సభ్యుడు రాష్ట్ర కార్యవర్గంలోకి ఒక బయటి వ్యక్తిని ప్రతిపాదించారు. దానికి బాలగోపాల్ 'ఇదేం కాంగ్రెస్ పార్టీ కాదు,

* **మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి, నల్గొండ**

ఎవరినో ఒకర్ని తీసుకోవడానికి. పనిచేసే వాళ్ళకే స్థానం' అంటూ ఆ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. విలువల ఆచరణలో చిన్నపాటి భంగం ఏర్పడినా ఆ ప్రయత్నాన్ని ఆయన నిలువరించకుండా ఉండలేరు. ఆ ప్రయత్నంలో అవతలివారు ఎంతటి సన్నిహితులయినా ఆయన మొహమాటపడరు.

హక్కుల కార్యకర్తలుగా మనం ఆయన దగ్గరనుంచి స్వీకరించాల్సిన లక్షణాలెన్నో ఉన్నాయి. నిబద్ధత, ధైర్యం, తెగువ, నమ్మిన విలువలకి అనుగుణమైన ఆచరణ వంటి అంశాలెన్నో. వీటన్నిటినీ సూచించే ఘటనలెన్నో పరంపరగా కళ్ళముందు కదలాడుతున్నాయి.

బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ జరపడానికి జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఒకసారి నల్గొండకు వచ్చింది. 1993 అనుకుంటా. జిల్లాపరిషత్ గెస్ట్‌హౌస్‌లో కమిషన్ విడిది చేసింది. బాధిత కుటుంబాలను కమిషన్ ముందు ప్రవేశపెట్టడానికి బాలగోపాల్, కన్నబిరాన్ కూడా హాజరయ్యారు. అప్పటికే పెద్ద సంఖ్యలో ఉన్న సాయుధ మఫ్టీ పోలీసులూ, నక్సలైట్ బాధిత కుటుంబాల వారూ బాలగోపాల్‌పై రాళ్ళ దాడికి దిగారు. బాలగోపాల్‌తో సహా కొందరు హక్కుల కార్యకర్తల చొక్కాలను చింపేసారు. అందరం నిస్సహాయంగా అక్కడ నుంచి నిష్క్రమించాం. బాలగోపాల్ ఒక్కరే కొద్ది విరామం తర్వాత వెనక్కి వెళ్ళి విచారణలో పాల్గొని బైట జరిగిన ఘటనను కమిషన్ దృష్టికి తీసుకువెళ్ళారు. మర్నాడు వరంగల్‌లో జరిగిన విచారణలో సైతం పాల్గొన్నారు. దాడి జరిగిందన్న కారణంతో తాను చేయాల్సిన పనిని మానుకోలేదు. శరీరానికో, ప్రాణానికో హాని చేయగల ప్రమాదకర పరిస్థితులను కూడా లెక్కచేయని మొండి ధైర్యం ఆయనది.

## విశాల దృష్టి

నయీమ్ అనుచరులు ఎపిసిఎల్‌సి నల్గొండ జిల్లా కార్యదర్శి ఆజం ఆలీని ఫిబ్రవరి 18, 2001 నాడు నడిబజారులో పట్టపగలు హత్య చేశారు. మేముగానీ, ఎపిసిఎల్‌సి సభ్యులుగానీ ఎవ్వరమూ హత్యాస్థలానికి పోయే సాహసం చేయలేకపోయాం. కానీ వార్త తెలిసిన వెంటనే హైదరాబాద్ నుంచి కోర్టుపని మానుకుని బాలగోపాల్ హత్యాస్థలానికి చేరుకొన్నారు. ప్రభుత్వ కనుసన్నల్లో నయీం ముఠా చేస్తున్న హత్యా రాజకీయాలను ఖండించారు. ఇక్కడ ధైర్యాన్నే కాదు మనం చూడాల్సింది – తన తోటి సంఘ సభ్యుని హత్యను హక్కుల ఉద్యమంపై జరిగిన దాడిగానే చూసాడు తప్ప మరొక విధంగా చూడని విశాల దృష్టిని.

ఈ విశాల దృష్టే ఆయన హక్కుల కార్యరంగాన్ని విస్తృత పరచింది. పౌర హక్కుల సంఘం అంటేనే నక్సలైట్ సంస్థలకు అనుబంధ ప్రజాసంఘం అనే చర్చ ఒకనాడు

ప్రజల్లో నడుస్తుండేది. మా జిల్లాలో కూడా కార్యరంగం ఆ పరిధిలోనే ఉండేది. ఇదేనా మన కార్యరంగం అని నేను అనుమానంగా ప్రశ్నించినపుడు బాలగోపాల్ నాకు ఒక చక్కని సలహానిచ్చారు. గత ఆరు నెలలుగా జిల్లాలోని దినపత్రికలని తిరగేసి ప్రజలను బాధిస్తున్న సమస్యలేమిటో సేకరించమని సూచించారు. నా వెతుకులాటలో కరువూ, చేనేత కార్మికుల ఆత్మహత్యలూ ప్రధాన సమస్యలుగా నా దృష్టికి వచ్చాయి. ఆ రెండు సమస్యలపైనా బాలగోపాల్ గారి నేతృత్వంలో మేం పర్యటించి వాస్తవాలను పత్రికల ద్వారా ప్రజల ముందుంచాం. మా కొత్త పని విధానాన్ని ప్రజలు ఆమోదించారు. హక్కుల కార్యరంగాన్ని ఎంత విస్తృతం చేయవచ్చో క్రమంగా మాకు బాలగోపాల్ స్పష్టం చేశారు. ఇదే స్ఫూర్తితో మేం జిల్లాలో దళితులపైనా, స్త్రీలపైనా అమలవుతున్న హింసపై పనిచేయడం మొదలుపెట్టాం. ఉద్యమం వ్యాప్తి చెందింది. కొత్త కార్యకర్తలు వచ్చారు. 'ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్' ఏర్పాటు, 'ఎఎమ్ఆర్‌పి' జలాలను హైదరాబాద్‌కు తరలించడం, సిమెంట్ కంపెనీల కాలుష్యం, ఫ్లోరైడ్ నీటి సమస్య వంటి సమస్యలపై మాతో పనిచేయించారు.

లాకప్‌లో దొంగల హక్కులు మొదలుకొని ఖైదీల, కార్మికుల, స్త్రీల, దళితుల, రైతుల, నిర్వాసితుల హక్కులనెన్నింటినో బాలగోపాల్ గుర్తించి, సమాజానికి అర్థం చేయించే ప్రయత్నాలను సాగించారు. మన వైఖరీ, ప్రయత్నాలూ ప్రజలకు అర్థంకాక వ్యతిరేకించిన సందర్భాల్లో కూడా ఆయన ఈ విషయాలపై సమాజంలో మరింత చర్చ జరగాలనీ, చర్చకు మనం తెరలేపాలనీ అనేవారు.

ఓసారి నల్గొండ జిల్లా సూర్యాపేట దురాజ్‌పల్లి గుట్టల్లో పోలీసులు ఇద్దరు దొంగల్ని కాల్చేసారు. బాలగోపాల్ సహా మా కమిటీ నిజనిర్ధారణకు వెళ్ళింది. మా నిజనిర్ధారణపై ప్రజలనుంచి వ్యతిరేకత వచ్చింది. ప్రజల భద్రతను భంగపరుస్తున్న వారినీ, బలవంతపు వసూళ్ళకూ, దౌర్జన్యాలకూ పాల్పడుతున్న వారినీ పోలీసులు చంపితే మీరెందుకు జోక్యం చేసుకుంటున్నారనే ప్రశ్న ప్రజలనుంచి వచ్చింది. నేర విచారణకు న్యాయస్థానాలుండగా పోలీసులు ఆ అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం తప్పుడు పద్ధతని బాలగోపాల్ వివరించారు. జీవించే హక్కునూ, నేర విచారణ హక్కునూ హరించడం హక్కుల ఉల్లంఘనే అవుతుందని తెలియజెప్పారు.

ఇలా ఎన్నో సందర్భాలు. ఆయన జ్ఞాపకాలు నన్ను వెన్నాడుతూనే ఉన్నాయి. ఆయనను గుర్తు చేసుకోవడమంటే ఆయనను ఆచరించడమే. ఆయనను ఆచరించడమంటే ఆ విలువలకు బద్ధులై బతకడమే.